



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సంగీత

పొరపాట్లు జరగకుండా ఎన్నికల విధులు నిర్వహించాలి

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 : రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులను నిర్వర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ పోలింగ్ రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని అన్ని నియోజకవర్గాల అధికారులు పూర్తి బాధ్యతతో ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి పూర్తి అవగాహనతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

16న పట్నం మున్సిపల్ 'అవిశ్వాస' సమావేశం


- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ శశాంక
- ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3: ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై అవిశ్వానికి ఈ నెల 16న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు అనుమతిస్తూ జిల్లా కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిసైడింగ్ అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డిని నియమించారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగే కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో స్రవంతి ఈ విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్నారు. దీనికిగాను ఛైర్‌పర్సన్ స్రవంతి సహా కౌన్సిలర్లకు వ్యక్తిగతంగా మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. కొంతకాలంగా ఇక్కడ మున్సిపల్ పాలకవర్గంలో ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది.

6న బీఆర్ఎస్ పార్టీ విస్తృత సమావేశం.. కేటీఆర్ హాజరు



ఈ నెల 6న ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు మన్నెగూడలోని వేద కన్వెన్షన్‌లో ఈ సమావేశం ఉంటుందని ఆయన చెప్పారు.



శాబాద్‌లోని బీసీ వసతి గృహం

- భవనాల అద్దెలూ పెండింగ్‌లోనే
- నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి
- అప్పులు చేసి వడ్డిస్తున్న వార్డెన్లు
- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని భోజనం

హాస్టళ్లకు ఆర్థిక కష్టాలు!

బీసీ వసతిగృహాలకు అందని బిల్లులు

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాలను ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. నాలుగు నెలలుగా మెస్ చార్జీలు విడుదల కావడం లేదు. దీంతో హాస్టళ్ల వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. కొందరు వార్డెన్లు వారి వేతనం మొత్తం ఖర్చు పెడుతున్నారు. ప్రతి వార్డెన్ బయట అప్పుచేసి హాస్టల్‌ను నిర్వహించాల్సి రావడంతో అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం కూడా అందించడం లేదు. దీంతో విద్యార్థులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు.



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 : హాస్టళ్లకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు, వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సక్రమంగా డబ్బులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు హాస్టళ్ల నిర్వహణకు తీసుకున్న అద్దె భవనాలకు అద్దె డబ్బులు కూడా చెల్లించడం లేదు. దీంతో భవనాల యజమానులు తమపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని.. చేసేది లేక తామే ఆ డబ్బులు చెల్లించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. పాఠశాల వసతి గృహాల విద్యార్థులకు 3 నుంచి 7వ తరగతి వరకు ప్రభుత్వం నెలకు రూ.950 డైట్ చార్జీలు చెల్లిస్తోంది. 8 నుంచి 10వ తరగతి వరకు నెలకు రూ.1,100, కళాశాల వసతిగృహాల విద్యార్థులకు నెలకు రూ.1,500 చెలిస్తోంది. అయితే, ఈ డైట్ బిల్లులు ప్రతి నెలా సక్రమంగా విడుదల కాకపోవడంతో వార్డెన్లు నానా ఇబ్బందులు పడుతున్నారు. 1,033 మంది పాఠశాల వసతి గృహాల విద్యార్థులకు సంబంధించి రూ.49.59 లక్షలు డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 3,905 మంది కళాశాల వసతి గృహాల విద్యార్థులకు సంబంధించి రూ. రెండు కోట్ల రెండు లక్షల 67వేల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు సంబంధించిన అద్దె బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రీ మెట్రిక్‌కు సంబంధించి రూ.7.23 లక్షలు, పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌కు సంబంధించి రూ. కోటీ 30లక్షల 67వేలు పెండింగ్‌లో ఉన్నాయి.

జిల్లాలో హాస్టళ్ల వివరాలు

పాఠశాల హాస్టళ్లు	18
ప్రభుత్వ భవనాల్లో నడిచేవి	16
అద్దె భవనాల్లో నడిచేవి	02
విద్యార్థుల సంఖ్య	1,033
కాలేజీ హాస్టళ్లు	21
ప్రభుత్వ భవనాల్లో నడిచేవి	01
అద్దె భవనాల్లో నడిచేవి	20
విద్యార్థుల సంఖ్య	3,905

అప్పులు చేసి విద్యార్థులకు భోజనం

నాలుగు నెలల నుంచి సంక్షేమ వసతి గృహాలకు బిల్లులు విడుదల కాకపోవడంతో హాస్టల్ అధికారులు అప్పులు చేసి హాస్టళ్లను నెట్టుకొస్తున్నారు. ప్రతి ఆదివారం చికెన్, మంగళవారం, శుక్రవారం గుడ్లు, గురువారం, శనివారం అరటి పండ్లు ఇస్తున్నారు. ఉదయం పూట ఇడ్లీ ఇవ్వాలి కానీ.. నిత్యావసర సరుకులు ధరల పెరగడంతో కేవలం ఉప్మాతోనే సరిపెడుతున్నారు. గతంలో వారానికి మూడు గుడ్లు ఇచ్చేవారు, గుడ్డు ధర పెరగడం వల్ల రెండుకే పరిమితం చేశారు. కిరాణా దుకాణ యజమానులు కూడా తమకు అరువుపై సరుకులు ఇవ్వడం లేదని వార్డెన్లు వాపోతున్నారు.



మెస్ బిల్లులు విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు (ఫైల్)

మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి. గత ప్రభుత్వం విద్యారంగం పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. గత ఏడాది కాలంలో వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విడుల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుంది. గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు కూడ అమలు కావడం లేదు. బిల్లులు రాక పోవడంతో వార్డెన్లు అప్పులు తీసుకువచ్చిన హాస్టల్స్ నడపుతున్నారు. త్వరగా మెస్ బిల్లులు విడుదల చేయాలని లేకుండా జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టాల్సి ఉంటుంది.

బి. శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ప్రత్యేక అధికారులు బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 : గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. శనివారం మంత్రి సీతక్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రి తెలిపిన విషయాలను అధికారులకు వివరించారు. ప్రత్యేకాధికారులు గ్రామ పారిశుధ్య కార్మికులు, యువతను భాగస్వామ్యం చేస్తూ గ్రామాభివృద్ధి కోసం పలు సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. వారం పాటు నిర్వహించే టెస్ట్ డ్రైవ్‌ను రోజుకో కార్యక్రమం చొప్పున ఏడు రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో దిలీప్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఇంజ నీర్లు, మిషన్ భగీరథ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పనితీరు బాగుంది

- మహారాష్ట్ర బృందం కితాబు
- చిలుకూరు పంచాయతీని సందర్శించిన మహారాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : తెలంగాణ ప్రభుత్వ పథకాలు, శాఖల వారీగా ప్రజలకు అందిస్తున్న సేవలు భాగున్నాయని మహారాష్ట్రకు చెందిన అధికారులు, జిల్లా పరిషత్ ఛైర్మన్‌ల బృందం కితాబిచ్చింది. రాజేంద్రనగర్‌లో ఉన్న ఎన్ఐఆర్‌డీలో ప్రభుత్వ పథకాలను తెలుసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఆ శాఖల పనితీరు ఎలా ఉంది. ప్రజలకు అందిస్తున్న సేవలపై తెలుసుకునేందుకు శనివారం మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామ పంచాయతీని సందర్శించారు. పంచాయతీ పరిధిలో ఎలాంటి శాఖలు పని చేస్తున్నాయి. గ్రామ పంచాయతీ ద్వారా ఎలాంటి సేవలు ప్రజలకు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ భూములు, ఇతర అన్ని శాఖల పనితీరుపై ఎంపీడీవో సంధ్య మహారాష్ట్ర అధికారుల బృందానికి వివరించారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న తీరు చాలా బాగున్నాయని మహారాష్ట్ర బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇక్కడ జరుగుతున్న పథకాలను పరిశీలించి తమ రాష్ట్రంలో కూడా అమలు చేసుకునే విధంగా అన్ని శాఖల వారీగా తెలుసుకోవడానికి ఇక్కడకు వచ్చినట్లు బృందం సభ్యులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బృందం వెంట సీఈవో ఉమారాణి, మండల పరిషత్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఏవో రాగమ్మ, ఏపీఎం రవీందర్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్, తదితరులు ఉన్నారు.



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న మహారాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే అధికారం

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 3 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే అధికారమని, పార్టీని మళ్లీ గెలిపించి మరోమారు దేశ ప్రధానిగా నరేంద్రమోడీని చేసేందుకు ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని వీరయ్యగార్డెన్‌లో చేవెళ్ల మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే దేశం బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. దేశ ఖ్యాతి, పేరు ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత భారతీయ జనతా పార్టీ కార్యకర్తలందరిపైనా ఉందన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నుండి బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మున్ముందు మంచి స్థానం దక్కుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, భారతీయ జనతా పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, దళితమోర్చా మండల అధ్యక్షుడు అశోక్, ఓబీసీ అధ్యక్షుడు కుమార్, మండల నాయకులు దేవుని శర్వలింగం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యపు కోరల్లో మంఖాల్

- మహేశ్వరం మండలం మంఖాల్ పారిశ్రామిక వాడపై రైతుల ఆందోళన
- విష వాయువులు, కలుషిత నీటితో పంటలకు నష్టం, మూగజీవాల మృత్యువాత
- కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ప్రేక్షక పాత్ర!

మహేశ్వరం, ఫిబ్రవరి 3 : పరిశ్రమల ఏర్పాటుతో అనేక మంది పేదలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించడం మంచిదే అయినప్పటికీ.. అదే పరిశ్రమలు విషవాయువులు వెదజల్లుతుంటే ప్రజలే కాదు.. పంటలకు తీరని నష్టం వాటిల్లుతోంది. అదేవిధంగా మూగజీవాలు, పక్షులు అనేక రకాల జీవాలు కాలుష్యం కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నాయి. వాటి ప్రాణాలకు ముప్పు కూడా పొంచి ఉంది. ఇదంతా కళ్ల ముందు జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. సమస్యలు చెప్పుకుందామన్నా అధికారులు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని మంఖాల్ పారిశ్రామికవాడలోని పలు కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

మహేశ్వరం మండల పరిధిలోని మంఖాల్ పారిశ్రామిక వాడలో వివిధ రంగాలకు చెందిన 35 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఒరిస్సా, బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికులు ఐదు వేలకుపైనే వివిధ రకాల పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కార్మికులకు జీవనోపాధి లభించడం మంచిదే కానీ, పరిశ్రమలు వెదజల్లుతున్న విషవాయువులతో పచ్చని పంటలు రంగుమారి ఎండిపోవడం, భూగర్భజలాలు కలుషితం కావడంతో పాటు బోరు బావుల నుంచి గోధుమ రంగు నీరు వస్తోంది. దాంతో మొహబ్బత్‌నగర్, తుమ్మలూరు, సిరిగిరిపురం, మహేశ్వరం, మంఖాల్, ఇమాంగూడ, శ్రీనగర్ గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మంఖాల్ పారిశ్రామిక వాడలో ఉన్న 35 పరిశ్రమల్లో ప్రధానంగా కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) ఆంక్షలకు విరుద్ధంగా లోయ లక్ష్మి, హసిత, ప్రియాంక, వనమాలి, రొటోప్యాక్ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది.



మంఖాల్ పారిశ్రామికవాడలోని ఓ కంపెనీ

అదేవిధంగా పరిశ్రమల నుంచి బయటకు వస్తున్న వృథా నీరు మంఖాల్ చెరువులోకి వెళ్లడంతోనే కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయి. మూగజీవాలు చెరువు నీటిని తాగడం లేదు. కాలుష్యం కారణంగా శ్రీశైలం-హైదరాబాదు ప్రధాన రహదారితో పాటు మహేశ్వరం వెళ్లే రహదారి వెంట దుర్వాసన రావడంతో ప్రయాణికులు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటువైపు కన్నెత్తికూడా చూడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. అధికారులు స్పందించి మంఖాల్ పారిశ్రామికవాడలో ఉన్న కంపెనీలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. కాలుష్యంతో పాటు కలుషిత నీటి సమస్యపై ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, లేనియెడల పరిశ్రమల ఎదుట తీవ్ర ఆందోళన చేయాల్సి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



పరిశ్రమల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి లభించడం మంచి ఉద్దేశ్యమే గానీ, అదే పరిశ్రమల ద్వారా వెలువడుతున్న కాలుష్యంతో రైతులు, ప్రజలు, మూగజీవాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కాలుష్యం వల్ల అనేక వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి కాలుష్య నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

- అలువాల రవికుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో జిల్లా సోషల్ ఫోరం ఉపాధ్యాయులు

వికారాబాద్, ఫిబ్రవరి 3: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్‌ప్రతిష్టాన్, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో జడ్పీహెచ్ ఎస్ (బాలికల) 10వ తగరతి విద్యార్థులకు జిల్లాస్థాయి సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో మీడియం వారీగా ముగ్గురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గాజుల బస్వరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈటాలెంట్ టెస్ట్ ద్వారా రాబోయో పదో తరగతి పరీక్ష సన్నద్ధతకు ఉపయోగపడు తుందని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌ను విజయ వంతం చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు మీడియం నుంచి ధారూరు మండలం కుక్కింద పాఠశాల విద్యార్థి నీలకంఠం, దుద్యాల్ మండలం కుడుమల పాఠశాల విద్యార్థి కె.అశ్విని, ధారూరు కుక్కింద విద్యార్థి స్వప్నతో పాటు దోమ మండలం దీర్సం పల్లి విద్యార్థి అబ్దుల్ రహమాన్ ఎంపికయ్యారు. అదేవిధంగా ఇంగ్లీష్ మీడియంలో మోమిన్‌పేట మేకవనంపల్లి విద్యార్థి నీతిక, వికారాబాద్ బాలికల పాఠశాల విద్యార్థి నందిని, పెద్దేముల్ మంబాపూర్ విద్యార్థి సంపత్ కుమార్‌తో పాటు పూడూరు విద్యార్థి ఇస్మాయిల్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ ఫోరం ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, లాలయ్య, జాక వెంకటేశం, రాఘవేందర్, యాదయ్య, అరుణ్‌కుమార్, సురేందర్, మధుసూదన్, వెంకటయ్య, వివిధ మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, వివిధ మండలాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ ఎనలేనిది


ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

కీసర, ఫిబ్రవరి 3: పిల్లలపై తల్లిదండ్రులు చూపే ప్రేమ ఎనలేనిదని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ టి.హరిశ్చంద్రప్రసాద్ అన్నారు. రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ హరిశ్చంద్రప్రసాద్, బిట్స్ కళాశాల డీన్ బెనర్జీ, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రెసిడెంట్ కృష్ణదేవ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమోద్ శామ్ జోయిస్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడ, వ్యాసరచన, ఇతర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అదేవిధంగా వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి వీక్షించిన వారిని ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

చెట్లను తొలగించిన వారికి నోటీసులు

కీసర, ఫిబ్రవరి 3: హెచ్ఎండీఏ వెంచర్‌లో ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లను తొలగించిన వారికి పంచాయతీ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. మండలంలోని గోధుమకుంట గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 42/పీ లోని హెచ్ఎండీఏ వెంచర్‌లో నాటిన 198ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లను గ్రామపంచాయతీలో ఎలాంటి సమాచారం లేకుండా చెట్లను తొలగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలోని హరితహారం చెట్లను తొలగించినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కావున 42/పీలో ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లను తొలగించిన కందాడి పోచిరెడ్డి, కందాడి రవీందర్‌రెడ్డి, రాంప్రదీప్‌లకు గోధుమకుంట గ్రామపంచాయతీ అధికారులు నోటీసులు జారీచేశారు. మూడు రోజుల్లో పోచిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంప్రదీప్‌లు వివరణ ఇవ్వాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లాలో చిరుత మృత్యువాత

- పెద్ద ఎల్కిచర్ల అటవీ ప్రాంతంలో కళేబరం
- సహజ మరణమేనన్న అటవీ అధికారులు



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ, పశువైద్యాధికారులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామ శివారులో చిరుతపులి చనిపోయింది. శుక్రవారం మేకల కాపర్లు శివారులోని అటవీ ప్రాంతంలోకి మేకలను తోలుకెళ్లగా అక్కడ వారికి చిరుత కళేబరం కనిపించింది. శుక్రవారం రాత్రి గ్రామస్తుల పోలీస్లు అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం పోలీస్లు అటవీ అధికారులు పశు వైద్యాధికారులతో కలిసి మటనా స్థలానికి వెళ్లి చిరుత కళేబరాన్ని పరిశీలించారు. చిరుతది సహజ మరణమేనని నిర్ధారించారు. అది నాలుగు రోజుల క్రితం చనిపోయి ఉంటుందని శరీర భాగాలు పూర్తిగా కుళ్లిపోయాయని, వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారని రంగారెడ్డి జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. కాగా, అడవిలో మరో చిరుత సంచరిస్తున్న ఆనవాళ్లున్నాయని, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలి


- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుక

పరిగి, ఫిబ్రవరి 3 : పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో శనివారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో పదోతరగతి పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, వారి ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. ప్రత్యేక తరగతులు, రోజువారీ పరీక్షలు నిర్వహించి అభ్యసన స్థాయిని పెంచాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సారి జిల్లాలో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ బాధ్యతతో పని చేయాలని, ఫలితాలు తక్కువగా వస్తే హెచ్ఎంలు, సబ్జెక్టు టీచర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. పరిగి, కులకచర్ల ఎంఈవోలు హరిశ్చందర్, హబీబ్, నాలుగు మండలాల ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి నిరంజన్‌రెడ్డి సస్పెన్షన్



మర్రి నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, ఫిబ్రవరి 3 : ఆదిభట్ల మునిసిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే కారణం చూపుతూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డి శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంకోసం కౌన్సిలర్లతో కలిసి ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లతో క్యాంపు నడుపుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై జనవరి 30న నిరంజన్‌రెడ్డికి పార్టీ షోకాజ్ నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అధిష్ఠానం ఇచ్చిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నప్పటికీ ఆయన నుంచి ఎలాంటి వివరణ రాకపోవడంతో క్రమశిక్షణ చర్యలో భాగంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

ఇంటర్‌స్కూల్ క్రికెట్ టోర్నీ విజేత నాసర్ స్కూల్



ట్రోఫీతో నాసర్ స్కూల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పీవీజేఎస్ స్మారక ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నాసర్ స్కూల్ విజేతగా నిలిచింది. మొయినాబాద్‌లోని సూజాత స్పోర్ట్స్ అకాడమీలో గురువారం ప్రారంభమైన ఈ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండస్ స్కూల్ 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. ఛేదనలో నాసర్ స్కూల్ 8.5 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 87 పరుగులు చేసి విజేతగా నిలిచింది. టోర్నీ నిర్వాహకులకు సహాయ సహకారాలందించిన జ్వాల గుత్తా అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఎండీ క్రాంతికి సూజాత స్కూల్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

ఇన్‌చార్జిలే దిక్కా?

- రిజిస్ట్రేషన్ల శాఖ తీరు ఇదీ
- రంగారెడ్డి, హైదరాబాద్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీ
- మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్‌కు అసిస్టెంట్ ఐజీగా అదనపు బాధ్యత
- రంగారెడ్డి డీఐజీకి అదనంగా మేడ్చల్ బాధ్యతలు
- అవకతవకలపై ఆడిట్లు కరువు
- ఆదాయ వనరే.. అయినా పట్టించుకోని సర్కారు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ల శాఖలో అదనపు బాధ్యతలతోనే అధికారులు నెట్టుకొస్తున్నారు. ఇన్‌చార్జిలతో పాలన గాడి తప్పింది. రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ పోస్టులతో పాటు మేడ్చల్ డీఐజీ పోస్టుల్లోనూ ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. ఓవైపు ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తున్నా ఖాళీ పోస్టులకు మాత్రం అర్హత కలిగిన అధికారులతో భర్తీ చేయడం లేదు. ఉన్నవారికే ఒకటికి మించి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల వారు ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పర్యవేక్షణ అంతంతమాత్రమే. ఖాళీగా ఉన్న ఆడిట్ రిజిస్ట్రార్ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆడిట్లు తూతూమంత్రంగానే చేస్తున్నట్లు తెలుస్తోంది.

కనీసంగా పట్టించుకోని వైనం..

గ్రేటర్ పరిధిలో కీలకమైన హైదరాబాద్ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నల్గొండలో పనిచేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ప్రకాశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రంగారెడ్డి జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా ఆదే జిల్లా రిజిస్ట్రార్ స్థితప్రజ్ఞకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ సంతోష్‌ను ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పోస్టులో ఇన్‌చార్జిగా నియమించారు. గతేడాది ఆగస్టు 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇన్‌చార్జి అధికారుల నియామకం జరిగి ఆర్నెల్లవుతున్నా, రెగ్యులర్ అధికారుల నియామకంపై ప్రభుత్వం కనీసం దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలంటున్నాయి.

తెగని డీఐజీల పంచాయితీ

మరోవైపు మేడ్చల్ జిల్లాకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఆగస్టు 22న పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రవీందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న నిజామాబాద్ డీఐజీ మధుసూదన్‌రెడ్డిని కరీంనగర్ డీఐజీగా బదిలీ చేసింది. జీవో విడుదల చేసిన రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ 24గంటలు గడవకముందే ఆ పోస్టింగ్‌లో మార్పులు చేస్తూ మరొక జీవో జారీ చేశారు. కరీంనగర్‌కు పంపిన డీఐజీ మధుసూదన్‌రెడ్డిని వెంటనే మేడ్చల్ డీఐజీగా, మేడ్చల్ డీఐజీగా రవీందర్ బాధ్యతలు స్వీకరించక మునుపే ఆయనను కరీంనగర్ డీఐజీగా బదిలీ చేస్తున్నట్లు రెండో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఆకస్మిక బదిలీల వ్యవహారంపై ఇద్దరు అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారిద్దరినీ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో మేడ్చల్ డీఐజీ పోస్టులో రంగారెడ్డి డీఐజీ టీ.కిషన్‌లాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కీలకమైన పోస్టుల్లో అధికారులకు పదోన్నతులిచ్చి రెగ్యులర్ అధికారులుగా నియమించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు చేపట్టడంలేదని ఉద్యోగ వర్గాలంటున్నాయి. కమిషనర్‌గానూ ఇన్‌చార్జి అధికారే కొనసాగుతుండడం వల్ల కూడా రెగ్యులర్ అధికారుల నియామకంపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ అధికారుల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి
మూడు నెలల్లో 12 బైకులు చోరీ

- అంతర్ జిల్లా బైక్ల దొంగ అరెస్ట్
- రూ. 17.30 లక్షల విలువగల బైకులు స్వాధీనం
- గతంలోనే 13 కేసుల్లో పది సార్లు జైలుకు
- నిందితుడి రిమాండ్ - జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3 : అతడి వయస్సు 24, 15 ఏళ్ల వయస్సులోనే తన తల్లితో కలిసి ఓ దొంగతనం.. ఆపై 13 కేసులలో నిందితుడు.. పది సార్లు జైలు జీవితం గడిపినా మారని వక్ర బుద్ధి. ఇది పోలీసులు అరెస్ట్ చేసిన ఓ నిందితుడి నేపథ్యం. మూన్నెళ్ల క్రితమే జైలు నుంచి విడుదలై జల్సాలకు అలవాటు పడి 12 బైకులను దొంగిలించి తక్కువ ధరకు అమ్ముకుంటున్న అంతర్ జిల్లా నిందితుడిని వికారాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ. 17.30 లక్షల విలువ గల 12 బైకులను స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు పంపిన సంఘటన వికారాబాద్ టౌన్ ఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్పీ కోటిరెడ్డి సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. బంట్వారం మండలం తొర్మామిడి గ్రామానికి చెందిన గుడాల మాణిక్యం (24), 2018 నుంచి బైక్‌లను దొంగిలించి వాటికి నకిలీ ఆర్సీలను తయారు చేసి తక్కువ ధరలకు అమ్ముతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13 కేసులలో 10 సార్లు జైలుకు వెళ్లిగా 2023 అక్టోబర్‌లో విడుదలయ్యాడు. అయినా తన బుద్ధిని మార్చుకోకుండా మళ్లీ బైక్ దొంగతనాలు మొదలు పెట్టి మూడు నెలల్లోనే రూ. 17.30 లక్షల విలువ గల 12 బైకులు దొంగిలించాడు. సైబరాబాద్ పరిధిలోని 10 బైక్లు, వికారాబాద్, సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కొ బైక్లను దొంగిలించాడు. (రాయల్ ఎన్‌ఫీల్డ్ 3, యమహా 2, బజాజ్ పల్సర్ 6, హుండా షేన్ 1) వీటిని తొర్మామిడిలోని తన పొలం వద్ద షెడ్డును ఏర్పాటు చేసుకుని, అక్కడ భద్రపర్చాడు. గతంలో మెకానిక్ పని చేసిన అనుభవం ఉండడంతో వాటి లాక్‌లు తీసి, తాళం లేనివాటిని దొంగతనాలకు అలవాటు పడ్డాడు.

పోలీసులకు చిక్కింది ఇలా..

శనివారం ఉదయం వికారాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీసీఎస్ సీఐలు బలవంతయ్య బాలస్వామిలు, వికారాబాద్ టౌన్ ఎస్ఐ సత్యనారాయణరాజు తమ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా నిందితుడు టీఎస్ 08 హెచ్ జెడ్ 5070 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అతన్ని ఆపి బైక్ వివరాలు అడుగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా అతని నేరచరిత్రను, దొంగిలించిన బైక్ల వివరాలు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. 2009లో మాణిక్యం తన తల్లితో పాటు అతని తల్లిపై దొంగతనం కేసు బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో నమోదయిందని చెప్పారు. బైక్ దొంగతనాల విషయంలో నిందితుడికి ఇంకా ఎవరైనా సహకరించారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. భవిష్యత్ లో ఇంకా ఏఏ కేసులు ఉన్నాయని దర్యాప్తుచేసి నిందితుడికి శిక్ష పడేలా చేస్తామన్నారు. నిందితుడి వద్ద నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. మన చుట్టే నేరస్తులు ఉండే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ వారి ఇళ్ల, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను అరికట్టే అవకాశం ఉంటుందని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో పని చేసిన సీసీఎస్ సీఐలు బలవంతయ్య, బాలస్వామి, సిబ్బంది చెన్నయ్య, గోవింద్, అంజయ్య, క్రిష్ణారెడ్డి, రామచేందర్ రెడ్డి, అంజప్ప, సత్యయ్య గౌడ్, రామకృష్ణ, వికారాబాద్ టౌన్ పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు అందిస్తామని చెప్పారు.

సిబ్బంది సంక్షేమంలో ముందుంటా

సిబ్బంది సంక్షేమం విషయంలో ఎల్లప్పుడూ ముందుంటానని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి చెప్పారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన 'అన్యువల్ డీ మొబిలైజేషన్ పరేడ్ - 2024' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఏఆర్ పోలీస్ అధికారులకు మొబిలైజేషన్‌తో నూతన ఉత్తేజం, సమయపాలన, క్రమశిక్షణతో పనిచేయడం అలవాటవుతుందన్నారు. ఈ సారి మొబిలైజేషన్‌లో ఏఆవో, ఐటీసీ, క్యూఆర్ టీం, ఫింగర్ ప్రింట్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో తరగతులు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు కుటుంబ సభ్యులకు మెడికల్, హెల్త్ క్యాంపులు, సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏవో జోర్జియా, ఆర్ఐ అంజన్‌కుమార్, ఐటీసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీఎస్ రాజు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్‌లో గ్యాస్‌కు బదులుగా నీళ్లు

- ఆందోళన వ్యక్తం చేసిన బాధితుడు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



గ్యాస్ సిలిండర్ నుంచి వస్తున్న నీటిని చూపుతున్న బాధితుడు

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : వంటగ్యాస్ నిండకుండా గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు చేర్చి అందులో గ్యాస్ లేకుండా నీళ్లు ఉండటంతో ఓ వినియోగదారుడు ఆందోళన చెందిన సంఘటన మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం జరిగింది. బాధితుడు పల్లె శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన ఇంట్లో వంట గ్యాస్‌సిలిండర్ అయిపోవడంతో స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుక్ చేయగా గ్రామానికి వచ్చిన ఏజెన్సీ వారి నుంచి శేఖర్ సిలిండర్ తీసుకున్నాడు. దాన్ని ఇంటికి తీసుకెళ్లి సీల్ ఓపెన్ చేయగా అందులో నీళ్ల శబ్దం వచ్చింది. అనుమానం వచ్చి చూడగా అందులో గ్యాస్‌కు బదులు నీళ్లు వచ్చాయి. ఈ విషయాన్ని మొయినాబాద్‌లోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్దకు తీసుకు వెళ్లగా ఎలా జరిగిందో కనుక్కుంటామని సమాధానం ఇచ్చారని, గ్యాస్ సరఫరా చేసే వాళ్లు వినియోగదారులను మోసం చేస్తున్నారని బాధితుడు శేఖర్ ఆరోపించాడు. తనకు జరిగిన మోసం మరొకరికి జరగకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

'న్యాయ్‌యాత్ర'కు అనూహ్య స్పందన



వంశీచంద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, ఫిబ్రవరి 3 : పాలమూరు ప్రగతి కోసం మక్తల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ్‌యాత్ర దిగ్విజయంగా కొనసాగుతుందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల మీదుగా సాగుతున్న న్యాయ్‌యాత్రకు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభిస్తోందని చెప్పారు. శనివారం వంశీచంద్‌రెడ్డిని మక్తల్, నారాయణపేటలో పాదయాత్ర విరామ సమయంలో కల్వకుర్తి కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తమ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ భారత్ న్యాయ్‌యాత్ర చేపట్టగా వంశీచంద్‌రెడ్డి పాలమూరు ప్రగతి కోసం న్యాయ్‌యాత్ర చేపట్టారని అన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, హీరా సింగ్, తులసీరామ్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తే కఠిన చర్యలు

- ఆస్పత్రికి అన్ని పరికరాలను సమకూరుస్తాం
- వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 3 : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ కమ్యూనిటీ ఆస్పత్రికి అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులకు ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించకుండా నేరుగా ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ పద్ధతిని మార్చుకోవాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రికి కావాల్సిన వైద్య పరికరాలన్నింటినీ ప్రభుత్వం ద్వారా అందజేస్తానని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఎల్లప్పుడూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని చెప్పారు.


ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి

కమ్యూనిటీ ఆస్పత్రితో పాటు, మండలాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పేద మహిళలు కూడా కాన్పుల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్న విషయం కూడా తన దృష్టికి వచ్చిందని చెప్పారు. డెలివరీ సందర్భంలో ఇబ్బందులు వస్తే ఆపరేషన్లు కూడా నిర్వహించాలని తల్లి, శిశువుల క్షేమంగా ఉండేలా వైద్య సహాయం అందజేయాలన్నారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు కూడా నిర్వహించాలని చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే ఆస్పత్రిని సీజ్ చేయించడానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి, కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు.. మన బడి ఉత్తదే

గత ప్రభుత్వం చేపట్టిన మనఊరు-మనబడి కార్యక్రమం అర్థాంతరమేనని, పాఠశాలలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం హైస్కూల్‌లో ఓ దినపత్రిక యాజమాన్యం విద్యార్థుల కోసం ప్రత్యేక రూపొందించిన ప్రశ్నాపత్రాన్ని ఆయన విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మైనార్టీ విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పించిందని తెలిపారు. ఇప్పుడు కూడా తమ ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలుస్తుందని చెప్పారు. బాబర్‌అలీఖాన్, చెన్నయ్య, సయ్యద్ ఖదీర్ పాల్గొన్నారు.

కేటీఆర్, మల్లారెడ్డి నీచపు మాటలు మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాజేష్

మేడిపేట, ఫిబ్రవరి 3 : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా ప్రజాప్రభుత్వాన్ని కూల్చివేస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి మల్లారెడ్డి మాట్లాడడంపై కాంగ్రెస్ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని చౌదరిగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేటీఆర్ ఆయన మాట్లాడుతూ శుక్రవారం చౌదరిగూడలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో వారు కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులపై నోరు పారేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి గాంధీభవన్‌కు అల్లుడితో కలిసి ఎందుకు వచ్చారని మల్లారెడ్డిని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికి పార్టీలో చేరడానికి మల్లారెడ్డి రాయబారాలు నడుపుతున్నారని మండిపడ్డారు. ఆయనను పార్టీలోకి రానిచ్చేది లేదని స్పష్టం చేశారు. రూ.300 కోట్లు ఖర్చుచేసి ఎన్నికల్లో గెలిచావని ఆరోపించారు. మల్లారెడ్డి 125గుడులను సొంత డబ్బులతో కట్టించడానికి కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆగస్టు ఎక్కడున్నాయో చూపించాలని దమ్ముంటే కేటీఆర్, మల్లారెడ్డికి సవాల్ విసిరారు. మల్లారెడ్డి ఆయన అల్లుడు ఎమ్మెల్యేలు ఉన్నంత వరకు కాలేజీల్లో పని చేసిన వారి బకాయిలను పేద విద్యార్థుల బిల్లుల కోసం పోరాడుతున్నారు. ఏమి ఎవ్వరూ చేశారు. చేసిన భూకబ్జాలు, మింగిన చెరువులే ఆయన్ని ఇక్కట్లపాలు చేస్తాయన్నారు. కందుల కుమార్, వేల్పు బాబురావు, కట్ట అంజనేయులు, వినోద్, బోజిరెడ్డి, దావి దొడ్డి, సిద్ధగిరి నర్సింహ, అనిల్, వెంకటరెడ్డి దామోదర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నను మురిపిస్తున్న మామిడి పూత

- గుబురుగా మామిడి తోటలు
- పూతతో కళకళలాడుతున్న చెట్లు
- ఈ సారి అధిక దిగుబడి వస్తుందనే ఆశలో రైతన్నలు




పూడూరులో నిండా పూతతో మామిడి తోట

పూడూరు, ఫిబ్రవరి 3 : మామిడి పూత వికారాబాద్ జిల్లా రైతులను మురిపిస్తోంది. ఎక్కడా చూసినా మామిడి తోటలు పూర్తిస్థాయిలో పూతకు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూత ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడితే ఈ సారి అధిక దిగుబడి వస్తుందని మామిడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మామిడికి అనువైన నేలలు ఉండడంతో దాదాపు 10,280 ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. మామిడి సాగుకే ఇక్కడి రైతులు మొగ్గు చూపుతున్నారు.

తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు

మామిడి తోటల్లో ప్రస్తుతం సగభాగం వచ్చిపూత, ఇంకొంత భాగం పూత, మరికొంత భాగం పూమొగ్గ దశల్లో పూత విచ్చుకోకుండా ఉంది. కావున ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు. మొదటి రెండు తొడులను తేలికగా ఇచ్చి మూడోది ఆడి పూర్తిగా ఇవ్వాలి. లేదంటే పూత అధికభాగం పిందె దశలోనే రాలిపోయే ప్రమాదం ఉంటుంది. చెట్టుకు తెల్ల మరియు పచ్చ పూత కంటే పూ మొగ్గలు అధికంగా ఉంటే మల్టీకే 5కేజీలు, సూక్ష్మపోషక మిశ్రమం 2.5 కేజీలు, ప్లానోఫిక్స్ 100 మిల్లీ లీటర్లు లేదా 500 మిల్లీ లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. పచ్చిపూత దశలో తేనెమంచు, బూడిద తెగుళ్ల నివారణకు థయోమిథాక్సామ్ 200 గ్రాములు లేదా ఎక్రిల్ 80శాతం, డబ్ల్యూజీ 150 గ్రాములు ఇవ్వాలి. పూత విచ్చుకున్న తర్వాత 10-15రోజుల వరకు ఎలాంటి మందులు పిచికారి చేయొద్దు. పిల్లపెంకు తామర పురుగుల నివారణకు డైమెథోయేట్‌ను లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లోనే నివారించుకోవాలి. పూత నుంచి పిందెలు ఏర్పడి బఠానీ సైజ్‌లో ఉన్నప్పుడు పదేళ్ల పైబడిన చెట్లకు డీఏపీ 700 గ్రాములు, ఎంవోపీ 600 గ్రాముల చొప్పున ప్రతి చెట్టుకు వేసి నీరు పెట్టాలి. పండు ఈగ బుట్టలను మిథాయిల్ యూజినాల్ ఎకరానికి 10 - 25 ఏర్పాటు చేసి 20 రోజులకు ఒకసారి మారుస్తూ పంట పూర్తయ్యే వరకు చేయాలని ఉద్యానవనశాఖ పరిగి అధికారి వై.జయంతి సూచించారు.

40 ఎకరాల్లో మామిడి సాగు



బీజాపూర్ జాతీయ రహదారి పక్కన పూడూరు గేటు సమీపంలో దాదాపుగా 40 ఎకరాల్లో వివిధ రకాల మామిడి సాగు చేస్తున్నాం. ముంబాయి, మహారాష్ట్ర, హైదరాబాద్‌కు ఎగుమతి చేస్తాం. ఈ సారి తోటలో పూత బాగా వచ్చింది. రెండు వారాల క్రితం ఉద్యానశాఖ ప్రతినిధులు వచ్చి ఇక్కడి మామిడి చెట్లను పరిశీలించారు. కొన్ని సూచనలు ఇచ్చారు.

-మధుసూదన్, రైతు, పూడూరు.

మామిడితోటకు అనువైన నేల



పూడూరు మండలంలో మామిడి తోటలకు అత్యధిక అనువైన ఎర్రమట్టి నేలలు ఉండడంతో మామిడి దిగుబడి అత్యధికంగా వస్తుంది. జిల్లాలోని మామిడి పరిమాణంలో పోల్చుకుంటే పూడూరు నేలల్లో పెద్దదిగా కాస్తాయి. ఇక్కడ ఎకరాకు దాదాపుగా 4టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి అధిక దిగుబడి వస్తుందని ఆశాభావం ఉంది.

-కాసని మధుసూదన్, రైతు, పూడూరు.

యాచారంలో ఆలస్యంగా..

యాచారం : కొన్నేళ్లుగా మామిడితోటలు చాలా ఆలస్యంగా పూత రావడంతో కాత దిగుబడి గణనీయంగా తగ్గుతుండడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఈ సారి పూత ఆలస్యంగా వచ్చినా తమకు లాభాలు వస్తాయనే ఆశలు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. జనవరి మొదటి వారానికల్లా పూత వచ్చి పిందె దశకు చేరుకునేదని, కానీ ఫిబ్రవరిలో కూడా ఇంకా పూత దశలో ఉండడంతో పంటపై ఆశలు లేవని రైతులు చెబుతున్నారు. కొన్ని చెట్లు పూర్తిగా పూతకు రాగా మరి కొన్నింటికి సగం కూడా రాలేదు, ఇంకొన్నింటికి అసలు పూతే లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు కూడా రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. పొగమంచు కమ్ముకోవడంతో పంటకు చీడపీడల బెడద అధికంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం సాయంత్రం వేళ చలి ఉండడం వల్ల పూత ఇంకా వస్తుందని చెప్పారు. కానీ చాలా వరకు పూత రాలుతుండడంతో పంట చేతికందుతుందో లేదో అనే అనుమానంతో ఉన్నారు. పూత దశలో చెట్ల చుట్టూ నీరందించడంతో ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే చాలా మామిడి తోటలకు పూత దశలో పలు కీటకాలు ఆశిస్తుంటాయన్నారు. పూత దశలో తగు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే కొంత లాభాలు వస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు. తెగుళ్లు మామిడి దిగుబడిని తగ్గించే ప్రమాదముందని చెప్పారు. కాత బాగా కాసినా వేసవిలో గాలి దుమారం, వడగండ్ల వాన కురిస్తే తమకు అప్పులు మిగులక తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులు, వడగండ్లు లేకుంటే లాభాలు వస్తాయని రైతులు ఆశతో ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బోరాన్-19 ని లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. నత్రజని పొటాష్ లోపం ఉంటే లీటర్ నీటిలో ప్రొఫినోఫాస్ 2ఎం.ఎల్ లేదా 3 మిల్లీ గ్రాముల కార్బెండిజమ్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. పూత వచ్చిన తరువాత మొగ్గదశలో ఉన్నప్పుడే లీటర్ నీటిలో డైమెథోయేట్ పిచికారి చేసుకోవాలి. పూతలో 4నుంచి 6 వేల పూలుంటాయి. వాతావరణ పరిస్థితులకనుగుణంగా నీటిని అందించడం, పోషక యాజమాన్యం చేపట్టాలి.

- కనకలక్ష్మి, డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి

టాలెంట్ టెస్ట్‌లో కొత్తపేట విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కేశంపేట/మాడ్గుల, ఫిబ్రవరి 3 : కేశంపేట మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం చదవుతున్న విద్యార్థి వైష్ణవి సాంఘిక శాస్త్రంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయిలో సాంఘిక శాస్త్రంపై టాలెంట్ పరీక్ష నిర్వహించారు. పదో తరగతి చదవుతున్న వైష్ణవి ప్రతిభ చాటి ప్రథమ బహుమతి అందుకుంది. రూ.2వేల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో విద్యార్థిని సత్కరించారు. ఈమేరకు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు శిరీష, విజయశ్రీ, సుజాత, కృష్ణయ్య, గైడ్ టీచర్ హరతీలను ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, హెచ్ఎం చంద్రశేఖర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస సాగర్‌లు అభినందించారు. అదేవిధంగా మాడ్గుల మండలం జడ్పీహెచ్ఎస్(నాగిళ్ల) పాఠశాల విద్యార్థిని సిరివెన్నెల నాలుగో స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. ఆమెను హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు. అనంతరం సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు కె.వెంకటయ్య, ఎస్.జంగయ్యలను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. విద్యాకమిటీ చైర్మన్ జయమ్మ, గ్రామస్తులు శ్రీశైలం, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్


కందుకూరు: ఆకులమైలారం గ్రామంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాంచందర్

కందుకూరు, ఫిబ్రవరి 3 : కేంద్రం ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని, ఈ నెల 16న చేపట్టనున్న గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ కోరారు. శనివారం మండలంలోని ఆకులమైలారం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.కుమార్‌తో కలిసి చేపట్టిన ఇంటింటి ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పేదవాళ్లకు శాపంగా మారాయని తెలిపారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా 16న నిర్వహిస్తున్న బంద్‌లో ప్రతీఒక్కరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.నరసింహ, పి.శ్రీరాములు, పి.కాళిదాసు, జి.మహేందర్, జంగయ్య, అచ్చన్న శివయ్య, ఐలమ్మ, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

కొందుర్గు : ఈనెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ఎంపీవో లాలయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. గోపాల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్ల అవుతున్నా.. రైతాంగ, కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని, కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయమ్మ, అమృత, రాంచంద్రయ్య, మంజుల, సత్యమ్మ, భాగమ్మలు పాల్గొన్నారు.


కొందుర్గు : ఎంపీవో లాలయ్యకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కేశంపేట : కార్మిక హక్కుల సాధనకై దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించే భారత గ్రామీణ బంద్‌కు మద్దతుగా తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులు సంఘం సమ్మె నోటీసు ఇచ్చింది. మండలంలోని పంచాయతీ కార్మికులు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ సమ్మె చేస్తున్నట్లు వారు వివరించారు. పంచాయతీ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, పద్మమ్మ, జంగయ్య, పారేశ్, రమేష్, రోశయ్య, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. సమ్మె నోటీసును ఎంపీడీవో శరత్‌చంద్రబాబుకు అందజేశారు. ఎం.శేఖర్‌రెడ్డి, జె.రాములు, దేవయ్య, భిక్షపతి, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న పంచాయతీ కార్మికులు

క్రైం కార్నర్

మూడిళ్లలో చోరీ.. నగలు అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ బాల్‌రామ్ నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 3: పట్టణంలోని ఉదయ్‌నగర్, శాంతినగర్ కాలనీల్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. చింతలపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఘటన మరువకముందే మళ్లీ ఆమనగల్లు పట్టణంలో ఒకేరోజు మూడు ఇళ్లలో చోరీ జరగడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. స్థానికుల, బాధితుల కథనం ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన పాతకోట కిష్టమ్మ రోజూ మాదిరిగా భోజనంచేసి అదే కాలనీలో నివాసముండే రెండో కుమారుడు సాయి ఇంట్లో పడుకోవడానికి వెళ్లింది. శనివారం తెల్లవారు జామున ఇంటికి చేరుకోగా.. ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న 25 తులాల వెండి పట్టీలు, తులంబావు బంగారు గుండ్ల దండ, కొంత నగదు దుండగులు అపహరించుకుపోయారు. అదేవిధంగా ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన తోకల అరుణ ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడపై ఉన్న రోల్డ్‌గోల్డ్ చైన్, బంగారు పుస్తెను బలవంతంగా లాక్కొని పరుగెత్తాడు. కాగా, చైన్ లాక్కునే క్రమంలో అరుణ మెడకు స్వల్ప గాయమైంది. మరో ఇంట్లో కూడా దొంగలు చోరీకి యత్నించారు. చోరీ జరిగిన ఇళ్లను శనివారం క్రైమ్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, కడ్తాల సీఐ శివప్రసాద్, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్‌లు పరిశీలించారు. క్లూస్ టీం రంగంలోకి దిగి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ తెలిపారు.

మగబిడ్డను కనడం లేదని భర్త రెండో వివాహం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన మొదటి భార్య
● కేసు నమోదు చేసిన ఆర్జీఐఏ పోలీసులు

శంషాబాద్, ఫిబ్రవరి 3 : మగబిడ్డను కనడం లేదని భార్యను శారీరకంగా హింసించి ఇంటి నుంచి పారిపోయిన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడు. దాంతో మొదటి భార్య శనివారం ఆర్జీఐఏ పోలీసులకు భర్తపై ఫిర్యాదు చేసింది. ఈమేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రామచంద్రయ్య కథనం ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ రాళ్లగూడ రాఘవేంద్రకాలనీలో నివాసముంటున్న సురేష్, అదే బస్తీకి చెందిన మనస్విని పదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వారికి ముందుగా పాప పుట్టింది. రెండోసారి గర్భవతి కాగా.. తనకు కొడుకు కావాలని భార్యపై సురేష్ ఒత్తిడి తెచ్చాడు. కాగా, పుట్టబోయేది ఆడబిడ్డ కావొచ్చనే అనుమానంతో భార్యకు బలవంతంగా అబార్షన్ చేయించాడు. ఇక అప్పటినుంచి తనకు మగ సంతానం కావాలని భార్యను శారీరకంగా వేధించేవాడు. ఈక్రమంలో వారి మధ్య తరచూ గొడవలు జరగడంతో.. ఆరు నెలల క్రితం సురేష్ ఇంటినుంచి బయటికి పారిపోయాడు. అనంతరం భార్యకు చెప్పకుండా మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి మొదటి భార్య ఫిర్యాదు చేయగా.. సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామచంద్రయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తూర్, ఫిబ్రవరి 3: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైజంక్షన్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వర్‌రావు(50) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. కాగా, నడుచుకుంటూ వెళ్తున్న వెంకటేశ్వర్‌రావును గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి పనులతోనే గుర్తింపు

కొందుర్గు, ఫిబ్రవరి 3: ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులతోనే గుర్తింపు వస్తుందని ఎంపీడీవో, చిన్నఎల్కిచర్ల ప్రత్యేకాధికారి డాక్టర్ అంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నఎల్కిచర్ల తాజా మాజీ సర్పంచ్ సంధ్యారాణి శేఖర్‌తో పాటు పాలకవర్గాన్ని, జీపీ సిబ్బందిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ సంధ్యారాణి మాట్లాడుతూ ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని, తనకు సహకరించిన గ్రామస్తులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీవో లాలాయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచి పనులు చిరస్థాయిగా నిలుస్తాయి

తలకొండపల్లి : ప్రజాప్రతినిధులు పదవి కాలంలో చేసిన పనులు, అందించిన సేవలు ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి అన్నారు. రాజకీయ ఎదుగుదలకు సర్పంచ్ పదవి తొలిమెట్టని అన్నారు. మండలంలోని లింగరావుపల్లిలో పదవీకాలం ముగిసిన పంచాయతీ పాలకవర్గానికి గ్రామస్తులు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పదవీ కాలం ముగిసిన సర్పంచ్ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ మణికంఠ, వార్డు సభ్యులను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. శ్రీనివాస్‌రెడ్డి, కేశవ రెడ్డిలు మాట్లాడుతూ విరమణ పదవికే గానీ ప్రజాసేవకు కాదన్నారు. బాల్‌రెడ్డి, అచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదయ్య, తిరుపతయ్య, సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, గాలయ్య, స్థానిక నాయకులు, తదితరులున్నారు.


కొందుర్గు : సన్మానం పొందిన తాజా మాజీ పాలకవర్గంతో ఎంపీడీవో అంజనేయులు

పట్టుదల విజయానికి సోపానం

కడ్తాల్ : పట్టుదలతో ముందుకు సాగే వారు జీవితంలో విజయాలు సాధించి అద్భుతంగా రాణిస్తారని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ప్రగతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ లు అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రగతి పాఠశాల పూర్వపు విద్యార్థి గూడూరు లక్ష్మీనర్సింహ, వార్డుసభ్యులు గణేశ్, శ్రీరాములుకు పాఠశాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ, లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డిలు వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కడ్తాల గ్రామాభివృద్ధికి సర్పంచ్, పాలకవర్గం చేసిన సేవలను వారు కొనియాడారు. పట్టుదల, క్రమశిక్షణతో పని చేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చు అనడానికి పూర్వ విద్యార్థులు లక్ష్మీనర్సింహారెడ్డి, గణేశ్, శ్రీరాములు సాక్ష్యమని తెలిపారు. మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ప్రగతి కోసం విద్య, విద్య కోసమే ప్రగతి అనేక నినాదంతో 1994లో ప్రారంభించబడి ఎందరో విద్యావంతులను తీర్చిదిద్దిన పాఠశాల ప్రగతిని అని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : పాలకవర్గాన్ని సన్మానిస్తున్న కాసు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

'కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి'

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : మున్సిపల్ పరిధిలోని సామా ఎన్‌క్లేవ్‌లో ఇటీవల కుక్కల దాడిలో మృతి చెందిన ఏడాది బాలుడు నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కుక్కల బెడద నివారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల ప్రచార కర్త యూత్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ ఇమ్రాన్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా శంషాబాద్ పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుంటే.. కమిషనరల్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో చిన్నారులపై కుక్కలు దాడి చేశాయని, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బాలుడిది నిరుపేద కుటుంబం కాబట్టి.. ఎవరూ పట్టించుకోవడం లేదదని, ఉన్నత కుటుంబానికి చెందినవాడైతే వెంటనే చర్యలు తీసుకునే వారా? అని ప్రశ్నించారు. బాలుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న నరేష్‌చారి

కొత్తూర్, ఫిబ్రవరి 3: వ్యాపారపరంగా, పారిశ్రామికంగా దినాదినాభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలోప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శనివారం నిర్వహించిన ఏబీవీపీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేస్తున్నా ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాల ఏర్పాటులో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, షాద్‌నగర్ నూతన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. శివకుమార్‌చారి, హర్షయాదవ్, సుమిత్‌కుమార్, రాజీవ్‌కుమార్, సుదర్శన్, రవితేజ, నితీష్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

'నాయీబ్రాహ్మణ' మండల కమిటీ

కడ్తాల్, ఫిబ్రవరి 3: కడ్తాల మండల భగత్‌సింగ్ నాయీబ్రాహ్మణుల సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం కడ్తాలలో నాయీబ్రాహ్మణులు సమావేశమై తమ సమస్యలపై చర్చించారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫీయుద్దీన్ సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానుగుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా శివ, కార్యదర్శిగా మహేందర్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకులు సత్కరించి అభినందించారు. సంఘం నాయకులు జంగయ్య, అంజయ్య, శంకరయ్య, శ్రీను, సత్తయ్య, శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాచారం, ఫిబ్రవరి 3 : మండలంలోని మాల్‌లో జాయిన్ మేయర్ మినిస్ట్రీస్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 300 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కంటి, దంత పరీక్షలు తదితర పరీక్షలు చేశారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం నిర్వహించారు. కంటి ఆపరేషన్ కోసం పలువురిని నగరంలోని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కాంగ్రెస్ నాయకులు మురళి పర్యవేక్షణలో వైద్యశిబిరం నిర్వహించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


అరటి మొక్కలకు నీరు పడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 3 : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున అరటిమొక్కలు నాటారు. బక్కని మాట్లాడుతూ మొక్కలు, చెట్లు దేవుని ప్రతిరూపాలని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. వేంకటేశ్వరాలయంలో నాటిన అరటి మొక్కలతో ఆలయానికి శోభ సంతరించుకుంటుందన్నారు. అరటి చెట్టును పూజించడం వల్ల కష్టాలనుంచి విముక్తి పొందే అవకాశం ఉందన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం


హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

షాబాద్, ఫిబ్రవరి 3 : సనాతన ధర్మాన్ని కాపాడుకుందామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో భారత్‌కాలనీలో గల గణపతి అంజనేయస్వామి ఆలయంలో జస్టిస్ కొండా మాధవరెడ్డి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గీతా జ్ఞానయజ్ఞంలో భాగంగా హోమం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆధ్యాత్మిక వేత్తలు లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేష్, అంజిరెడ్డిలు హిందూ ధర్మంపై ప్రజలకు వివరించారు. రామాలయం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచారి, ఆ యా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలనంతరం బీఆర్ఎస్ కనుమరుగు


మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల అనంతరం కనుమరుగు కాక తప్పదని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోయామన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై విషరాజకీయాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మత రాజకీయాలు సాగిస్తూ రాజకీయ లబ్ధికి యత్నిస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా ధ్వంసమైందని, అవినీతి, దోపిడీ, అరాచక పాలన సాగించారని శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. గాడితప్పిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి చక్కదిద్దుతూ రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలను కాంగ్రెస్ శ్రేణులంతా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కిట్‌ను అందజేస్తున్న కవిత

మధ్యాహ్న భోజన కిట్ వితరణ

చౌదరిగూడ, ఫిబ్రవరి 3: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వనంపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త నూర్జహన్ బేగం, తహిమోద్దీన్‌లు మధ్యాహ్న భోజన కిట్‌ను అందజేశారు. మాజీ సర్పంచ్ కవిత గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు తులసి కృష్ణ, ఉపాధ్యాయులు శేకర్ గౌడ్, గ్రామస్తులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

తలకొండపల్లి, ఫిబ్రవరి 3: దేవుని పడకల్‌కు చెందిన పద్మ బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ సర్పంచ్ శ్రీశైలం సందర్శించి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తరఫున రూ.3వేలు, ఆయన రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. రవి, రామస్వామి, తదితరులు ఉన్నారు.

ఎస్సై కుప్పగిరి లింగంకు నాయకుల సన్మానం



ఎస్సై లింగంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, ఫిబ్రవరి 3: కేశంపేట నూతన ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న కుప్పగిరి లింగంను శనివారం మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులు సన్మానించారు. మండలాధ్యక్షుడు వీరేశ్ నేతృత్వంలో స్టేషన్‌కు వెళ్లిన నాయకులు ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, గిరిధర్‌యాదవ్, పర్వతాలు, జంగయ్య, ఇబ్రహీం, మల్లయ్య, రాములు, అనసూయమ్మ, రూప్లానాయక్ తదితరులున్నారు.

రియల్ వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్, ఫిబ్రవరి 3 : రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని షాద్‌నగర్ పట్టణానికి చెందిన రియల్ వ్యాపారులు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కోరినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన రియల్ వ్యాపారి సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ మూడేళ్ల క్రితం బీ ఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ లేవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ తెచ్చి రిజిస్ట్రేషన్లు నిలిపి వేసిన విషయాన్ని ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. లేవుట్ల క్రమబద్ధీకరణ కోసం ప్లాట్ల యజమానుల నుంచి రూ.10వేలు వసూలు చేసి ఇప్పటివరకు క్రమబద్ధీకరించలేదని, వెంచర్ యజమానులు అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, రియల్ ఎస్టేట్ రంగాన్నే నమ్ముకుని బతుకుతున్న వారిని ఆదుకోవాలని కోరారు.

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

కందుకూరు, ఫిబ్రవరి 3 : సర్పంచ్‌ల పదవీ విరమణ ముగిసిన వెంటనే ప్రత్యేకాధికారులు శనివారం బాధ్యతలు చేపట్టారు. నేదునూరు జీపీకి మండల వ్యవసాయాధికారి వై.లావణ్య, మీర్కాన్‌పేట, సార్లరావులపల్లి, ఆకులమైలారంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ ఎం.సతీష్‌రెడ్డి, ఆకులమైలారం, గుమ్మడవెల్లి, కొలన్‌గూడలో మిషన్ భగీరథ ఏఈ కె.ప్రణీత్, కందుకూరు, కొత్తగూడ, దెబ్బడగూడల్లో ఎంపీడీవో వెంకట్రాములు, లేమూరు, అగర్‌మియాగూడ, సరాస్వతిగూడ, గ్రామాలలో లేమూరు పశువైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. గూడూరు, అన్నోజిగూడ, కటికపల్లి గ్రామాలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.శ్రీహరి, జైత్వారం, బాచుపల్లి, కొత్తూరు గ్రామాలలో ఇరిగేషన్ ఏఈ ఎండీ ఖాజాహబీబుద్దీన్, ముచ్చర్ల, దాసర్లపల్లి, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లితాండ, పులిమామిడి గ్రామాలలో కందుకూరు పశువైద్యాధికారి డాక్టర్ రేవతి, దావుత్‌గూడ, పెద్దమ్మతాండ, గ్రామాలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కె. జగన్మోహన్‌రెడ్డి, చిప్పలపల్లి, ధన్నారం, మురళీనగర్ గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ ఎండీ తాజుద్దీన్, రాచులూరు, బేగంపేట, భైరాగిగూడ, గ్రామాల్లో తహసీల్దార్ కె.గోపాల్, తిమ్మాపురం, మాదాపురం, జబ్బార్‌గూడ గ్రామాల్లో రాచులూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎండీ షాహిన్‌షేక్ బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు తాజా మాజీ సర్పంచులు ప్రత్యేకాధికారులకు గ్రామపంచాయతీ రికార్డులు అప్పగించారు.

గ్రామాల్లో 'సొసైటీలు' ఏర్పాటు చేసుకోవాలి

● మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి రమేష్


సొసైటీ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ప్రత్యేక అధికారి రమేష్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఉపాధితో పాటు ఆర్థికంగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని, జిల్లాలోని ప్రతీ గ్రామంలో మత్స్యకారులు మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలను(సొసైటీ)లను త్వరగా ఏర్పాటు చేసుకోవాలని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి యు. రమేష్ సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో నూతన సొసైటీని రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఎన్నికైన సంఘం సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. అధ్యక్షుడిగా తలారి భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా కావలి బాల్‌రాజ్, కార్యదర్శిగా మోకిల అరుణ్‌కుమార్, డైరెక్టర్లుగా నందు, యాదయ్య, నవీన్, మహేందర్, నరేష్, లింగంలు ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన మత్స్యకారులతో పాటు ముదిరాజు కులస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

మహేశ్వరం, ఫిబ్రవరి 3 : మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవడానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, అందుకోసం నూతనంగా అన్ని గ్రామాల్లో పార్టీ గ్రామ శాఖలను ఏర్పాటు చేస్తున్నట్లు సీనియర్ నాయకుడు, మండల మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆకన్‌పల్లి, గట్టుపల్లి గ్రామాల్లో కాకి ఈశ్వర్ ముదిరాజ్ అధ్యక్షతన పార్టీ సమావేశాలు నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. గట్టుపల్లి అధ్యక్షుడిగా ఎండీ సాబేర్, ఆకన్‌పల్లి అధ్యక్షుడిగా కృష్ణయ్యలను ఎంపిక చేశామన్నారు. మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, వెంకట్‌రెడ్డి, అంజయ్య, గదగూటి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


గట్టుపల్లి గ్రామాధ్యక్షుడు సాబేర్‌ను సన్మానిస్తున్న నాయకులు